# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 270 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శనివారం | నవంబర్ | 9-11-2024 | వెల : .రూ. 5.0



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## ములాకత్ రాజకీయాలతో రేవంత్ బిజి

- కేటీఆర్‌తో రేవంత్ కాంప్రమైజ్ : బండి సంజయ్

హైదరాబాద్,
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, రేవంత్ కాంప్రమైజ్ అయ్యారని.. అందుకే మొన్నటి జన్వాడా కేసును గాలికి వదిలేశారంటూ విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌తో కేటీఆర్ ములాకత్ రాజకీయాలు నడిపిస్తున్నారని.. తెలంగాణలో యాక్టివ్ సీఎం కేటీఆర్ అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్,

-మిగతా 2 లో



## జస్టిస్ చంద్రచూడ్‌కు ఘనంగా వీడ్కోలు

### 10న పదవీ విరమణ చేయనున్న చీఫ్ జస్టిస్

నవంబర్ 8, (నీలగిరి ఎక్ ప్రెస్):న్యూఢిల్లీ,
భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు.

-మిగతా 2 లో



## బీజేపీ తీరుతో దేశం సర్వనాశనం

### రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు

సిమ్లా,
కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరుపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ తీరువల్ల దేశం సర్వనాశనం అయ్యిందన్నారు. మణిపూర్ గురించి చెప్పాలంటే మణిపూర్‌ను వాళ్లు (బీజేపీ) పూర్తిగా తగులబెట్టారని విమర్శించారు. ఇప్పటికీ మణిపూర్

-మిగతా 2 లో

# గోల్నాక గొల్లుమంది..
# దిలుసుఖ్‌నగర్ ఢీలా పడ్డది



- మోకాలికి దెబ్బ తగిలితే.. బోడి గుండకు కుట్లు వేసినట్లు గుంపు మేస్త్రీ పాలన
- మూసీ దాహానికి అత్తాపూర్ ఆగం..ఆగం
- ఎక్స్ వేదికగా రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

నవంబర్ 8, (నీలగిరి ఎక్ ప్రెస్): హైదరాబాద్:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ యాత్రపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు గుంపు మేస్త్రీ పాలన తీరు ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ బాధితులు ఉంటే.. నల్లగొండలో మూసీ పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కూల్చిన ఇండ్లెక్కడ, కాలిన కడుపులెక్కడ, నువ్ తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ

-మిగతా 2 లో


## కేటీఆర్ కు మతి భ్రమించింది

### అందుకే ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నాడు
### మరోమారు మండిపడ్డ మంత్రి పొంగులేటి



ఖమ్మం,
పచ్చకామెర్లు వచ్చినోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు.. కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని.. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న తమకు అతడి ప్రతి మాటకు స్పందిచాల్సిన అవసరం లేదని

-మిగతా 2 లో



## ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో విచారణ

- విచారణ 11కు వాయిదా వేసిన కోర్టు

నవంబర్ 8, (నీలగిరి ఎక్ ప్రెస్ :హైదరాబాద్,
తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. అనంతరం కేసు విచారణను 11వ తేదీకి వాయిదా వేవారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస తరపున సీనియర్

-మిగతా 2 లో



### తెలంగాణలో
## బీసీ కులగణన

- నేటి నుంచి ఇంటింటి సర్వే

హైదరాబాద్,
తెలంగాణ అసెంబ్లీలో బీసీ కులగణన 9వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. నేటినుంచి ఇంటింటి సర్వే ద్వారా వివరాలు సేకరిస్తారు. దీనిపై మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. కుల గణన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిని, కులాన్ని సర్వే చేసి.. ప్రజల ఆర్థిక స్థితి గతులు తెలుసుకుంటామని అన్నారు. సర్వేలో అన్ని వివరాలు పొందు పరుస్తామని.. సర్వ రోగ నివారిణిలా సర్వే ఉంటుందని పేర్కొన్నారు.

-మిగతా 2 లో



## ఇక యాదాద్రి కాదు...
# యాదగిరి గుట్టనే

### పేరు మారుస్తున్నట్లు సీఎం రేవంత్ వెల్లడి

- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట బోర్డు
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ
- స్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

నవంబర్ 8, (నీలగిరి ఎక్ ప్రెస్): యాదగిరిగుట్ట,
ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా వ్యవహారం లోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు

-మిగతా 2 లో




# ఇక యాదాద్రి కాదు.. యాదగిరి గుట్టనే

(మొదటి తరువాయి)

చేయనున్నట్లు వెల్లడించారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతించారు. పూర్ణకుంభ స్వాగతంతో అర్చకులు స్వాగతించారు. అనంతరం స్వామి పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు. తరవాత ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో సీఎం పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట బోర్డుకు తితిదే స్థాయిలో ప్రాధాన్యత ఉండేలా అధ్యయనం చేసి టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. గోశాలలో గోసంరక్షణకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. గోసంరక్షణకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను పూర్తి చేయాలని చెప్పారు. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందేనని అధికారులకు తేల్చి చెప్పారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక అందించాలన్నారు. మొత్తంగా యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అధికారులకు స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రపోజల్స్‌తో రావాలని అదేశించారు. ఆలయానికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి రిపోర్ట్ అందించాలని అన్నారు. ఇకనుంచి యాదాద్రి బదులుగా అన్ని రికార్డుల్లో యాదగిరిగుట్టగా వ్యవహారికంలోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ఈవో భాస్కరరావు మంత్రులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నేడు యాదాద్రికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు ముందస్తుగా మంత్రులు అక్కడికి చేరుకున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను వారు పరిశీలించారు.

## గోల్నాక గొల్లుమంది.. దిలుసుఖ్‌నగర్ ఢీలా పడ్డది

(మొదటి తరువాయి) వ్యక్తం చేశారు. నీ మూసీ దాహానికి అత్తాపూర్ ఆగమైందని, గోల్నాక గొల్లుమంటుందని, దిలుషక్ నగర్ ఢీలా పడిందన్నారు. నీ కుట్రలకు అంబర్ పేట్, అత్తాపూర్ అతలాకుతలం అవుతుంటే.. నీ పుట్టినరోజు వేడుకలు జరుగుతున్నది ఎక్కడని ప్రశ్నించారు. అయ్యా సంబరాల రాం బాబు.. నీ అన్యాయానికి ఆవేధనలు, ఆవేశాలు, ఆక్రందనలు వినిపిస్తున్నవి, కనిపిస్తున్నవి అక్కడ కాదు.. రా ఇటు వైపు రా ఇక్కడ చెయ్యి నీ పాదాల మీద యాత్ర అంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. తేలు మంత్రం రానోడు పాము కాటుకు మంత్రం ఏసినట్లు.. పాలన తెల్వని నీకు పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్ల మన్ను పోసినవ్ అంటూ మండిపడ్డారు. "మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు ఉంది గుంపు మేస్త్రీ పాలన తీరు హైదరాబాద్ లో మూసి బాధితులు ఉంటే- నల్గొండలో మూసి పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు కేటీఆర్ జన్మదినోత్సవ శుభాకాంక్షలు సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని, మీ ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడైనా రావచ్చంటూ ట్వీట్ చేశారు. విచారణకు వచ్చిన సిబ్బందికి చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ఇస్తానని తెలిపారు. వారు కోరితే మీ బర్త్‌డే కేక్ కూడా కట్‌చేయిస్తానని చెప్పారు. కాగా, అరెస్టు భయంతో కేటీఆర్ మలేషియా వెళ్నారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ న్యూస్‌పేపర్ రాసుకొచ్చిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ చేసిన ట్వీట్‌ను ఆయన కేటీఆర్ ట్యాగ్ చేశారు. కేటీఆర్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ఇదంతా చేస్తున్నారని మాకు తెలుసని, జర్నలిజాన్ని జోక్‌గా మార్చవద్దంటూ క్రిషాంక్ అందులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో చాయ్ తాగుతూ ఈ వార్తను చదువుతూ ఉంటారని చెప్పారు.

## కేటీఆర్ కు మతి భ్రమించింది

(మొదటి తరువాయి)

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి మరోసారి ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లాలో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ లాగా తొండాట ఆడాలనే ఉద్దేశ్యం ఇందిరమ్మ ప్రభుత్వానికి లేదని అన్నారు. అమృత్ టెండర్లలో ఒక్క రూపాయి వర్క్ రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు లేవని.. ఉంటే నిరూపించాలని కేటీఆర్‌కు ఛాలెంజ్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తోన్న కేటీఆర్‌కి సిగ్గుండాలని ఘాటు విమర్శలు చేశారు. కేబినెట్ మంత్రికి ఎలాంటి పవర్స్ ఉంటాయో తెలియని కేటీఆర్ పదేళ్లు ఎలా పని చేసాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో తప్పు చేసిన ఎవరినైనా వదిలిపెట్టమని.. చిన్న దొరనైనా, పెద్దదొరనైనా వదిలిపెట్టమని హెచ్చరించారు. మేఘా కృష్ణా రెడ్డి కంపెనీ లేదా ఇంకొక కంపెనీకి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఏ విధంగా రెడ్ కార్పెట్ వేశారో.. తెలంగాణ , దేశ వ్యాప్తంగా ప్రజలంతా గమనించారని.. ఆ వ్యాపారాలు చేసే సంస్థలు గమనించాయన్నారు. ఏ కంపెనీనైనా బ్లాక్ లిస్టులో పెట్టేందుకు అర్హులైతే ప్రభుత్వం తప్పకుండా బ్లాక్ లిస్టులో పెడుతుందని స్పష్టం చేశారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే క్లాజ్ తెలుసు, చట్టం ఏంటో తెలుసు.. అంత అమాయకంగా ఇక్కడ ఎవ్వరు లేరని.. తనతో సహా చట్టం విషయంలో ఎవరికి చుట్టాలు ఉండరని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడు పెట్టని విధంగా.. ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు కోసం రూ.72 వేల కోట్ల బ్డడెట్ పెట్టామని గుర్తు చేశారు. గత పదేళ్లు రాచరిక పరిపాలన చేసిన పెద్దలు.. అది పీకుతాం, ఇది పీకుతాం ప్రభుత్వాన్ని కూలుస్తాం అంటు ప్రగల్భాలు పలుకుతున్నారని ఘాటు విమర్శలు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కక్ష్య పూరిత రాజకీయాలు చేయమని చెప్పారు.

## ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో విచారణ

(మొదటి తరువాయి)

న్యాయవాది మోహన్‌రావు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదన్నారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత లేదన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు పలు కోర్టుల తీర్పులను మోహన్‌రావు చదివి వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.

## తెలంగాణలో బీసీ కులగణన

(మొదటి తరువాయి)

దేశంలోని సంపద, రాజ్యాధికారం జనాభా దామాషా ప్రకారం దక్కాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందు కోసమే ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే కుల గణన చేస్తామని చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా కులగణనతో పాటు సోషల్, ఎకానమిక్, ఎడ్యుకేషన్, పొలిటికల్, ఎంప్లాయిమెంట్ అంశాలపై సర్వే చేస్తాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటిని, అన్ని కులాలు, ఆర్థిక స్థితిగతలపై సర్వే నిర్వహిస్తాం. ఈ సర్వే ద్వారా సంపదను అన్ని వర్గాలకు జనాభా దమాషా ప్రకారం ఎలా పంచాలన్న దానిపై ప్రణాళికలు తయారు చేస్తాం. సామాజిక ఆర్థిక రాజకీయ మార్పునకు పునాదిగా తెలంగాణ మారబోతుందని భట్టి తెలిపారు.

## ములాకత్ రాజకీయాలతో రేవంత్ బిజి

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ ఒక్కటై బీజేపీని మీడియాలో లేకుండా చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో ఆ పార్టీ గురించి ఆలోచించే వారెవరూ లేరన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దింపే దమ్ము బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటారో పోతారో అనే భయం కేటీఆర్‌కు ఉందన్నారు. ప్రజా సమస్యల మీద కేసీఆర్ స్పందించడం లేదని.. కేటీఆర్ బామ్మర్ది అరెస్ట్ అయితే అధికారులకు ఫోన్ చేస్తారా అంటూ మండిపడ్డారు. కేటీఆర్ బామ్మర్ది మీద కేసు అయితే ఎమ్మెల్యేలు అంతా వెళ్తారని.. కానీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసు నమోదు అయితే మాత్రం వారిని పరామర్శించరన్నారు. అభ్యర్థి లేదు కాబట్టే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉంటుందంటూ వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్‌లు, ఆటో వాళ్ల పొట్ట కొట్టింది బీఆర్ఎస్సే అని.. మళ్ళీ వీరే వారి పట్ల సానుభూతి చెప్పేందుకు వెళ్తే వారు నమ్ముతారా అని నిలదీశారు. అందుకే కేటీఆర్‌ను అడ్డుకుంటున్నారన్నారు. ఆందోళనకారులు కూడా ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ వాళ్ళను ఉద్యమాలకు పిలిస్తే మీరే నష్టపోతారన్నారు. బీఆర్ఎస్‌లో హరీష్ రావు ఎంతో కొంత క్రిడిబులిటీ కలిగిన నాయకులని.. అయితే కేటీఆర్ అహంకారి అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ తమాషాలు మానేయాలని హితవుపలికారు. ప్రధాని గురించి కూడా ఏకవచనంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్రమంగా సంపాదించిన డబ్బు వల్లే అహంకారం పెరిగిందని.. ఆయన కళ్ళు నెత్తికెక్కాయంటూ విరుచుకుపడ్డారు. బండి సంజయ్, రేవంత్ ఒక్కటేనని సోషల్ మీడియా ద్వారా కేటీఆర్ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. " కేటీఆర్ గత చరిత్ర ఏంటి.. గతంలో నీవు మీ నాన్న చేసిన వ్యాపారం ఏంటి. ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి. కేటీఆర్‌కు రాజ్‌భవన్ అంటే గౌరవం లేదు. కేటీఆర్ ఆయనకి ఆయనే మలేసియా పారిపోయాడు అని ప్రచారం చేసుకున్నాడు. నీవు మలేషియా పారిపోయావ్ అనేది ఎంత నిజమో... రాజ్‌భవన్ వేదికగా నీ మీద కుట్ర జరిగింది అనేది అంతే నిజం అయ్యి ఉండొచ్చు. బీజేపీలోకి హరీష్ రావు వస్తానంటే తీసుకోవడం ... నా ఒక్కడి నిర్ణయం కాదు. మాది ఏక్ నిరంజన్ పార్టీ కాదు ... పార్టీలో అంతా కలిసి నిర్ణయం తీసుకోవాలి" అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు


## జస్టిస్ చంద్రచూడ్‌కు ఘనంగా వీడ్కోలు

(మొదటి తరువాయి)

ఈ క్రమంలో శుక్రవారం ఆయనకు చివరి పనిదినం కావడంతో సుప్రీం ధర్మాసనం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవమని.. అయినప్పటికీ తాను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నానని చెప్పారు.మరోవైపు సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులలైన సంగతి తెలిసిందే. నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఇదివరకే వెల్లడించారు. 2025 మే 13 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు.

# ప్రపంచంలో ఏ శక్తీ ఆర్టికల్ 370ని పునరుద్ధరించలేదు

-370- మహా ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



**ధులే**

ప్రపంచంలో ఏ శక్తీ జమ్ముకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ను పునరుద్దరించలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం తొలిసారిగా మోడీ రాష్ట్రంలో ప్రచారంలో పాల్గొన్నారు. ధులే జిల్లాలోని నాసిక్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌ను భారత రాజ్యాంగం నుంచి దూరంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ నేతృత్వం లోని ఇండియా వేదిక కోరుకుంటుందని విమర్శించారు. ప్రపంచంలో ఏ శక్తీ జమ్ముకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ను పునరుద్దరించలేదని అన్నారు. అలాగే ప్రజల మధ్య కులాల చిచ్చు పెట్టాలని కాంగ్రెస్ యత్నిస్తోందని, ప్రజలు ఐక్యంగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాల 'పాకిస్థాన్ ఎజెండా'ను ప్రోత్సహించవద్దని, వేర్పాటువాదుల భాష మాట్లాడవద్దని ప్రజలకు మోడీ విజ్ఞప్తి చేశారు. 'జమ్ముకాశ్మీర్‌లో అంబేద్కర్ రాజ్యాంగాన్ని మాత్రమే అనుసరిస్తారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం ఆ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ఎలా జరిగిందో టీవీల ద్వారా అందరూ చూశారు. నిరసన తెలిపిన బిజెపి ఎమ్మెల్యేలను బయటకు విసిరివేశారు' అని మోడీ తెలిపారు. గతంలో కాంగ్రెస్ మత రాజకీయాలకు పాల్పడిందని, ఇప్పుడు కుల రాజకీయాలకు పాల్పడుతోందని మోడీ విమర్శించారు. కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ)లతో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) చక్రాలు, బ్రేకులు లేని వాహనం అని, డ్రైవింగ్ సీటులో కూర్చోవడానికి అక్కడ గొడవ జరుగుతోందని మోడీ విమర్శించారు. 'కాంగ్రెస్ ఇప్పుడు అఖిల భారత కాంగ్రెస్ కాదు. ఇప్పుడు ఆ పార్టీ పరాన్నజీవి' అని మోడీ విమర్శించారు. 'మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, జార?ండ్..తో సహ అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇతర పార్టీల మద్దతుతో మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసే స్థితిలో ఉంది' అని మోడీ తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు రాజ్యాంగం, కోర్టులు, ప్రజల మనోభావాలను పట్టించుకోవని మోడీ విమర్శించారు. వచ్చే ఐదేళ్లలో మహారాష్ట్ర అభివృద్ధిని కొత్త శిఖరాలకు తీసుకెళ్తామని మోడీ చెప్పారు. మహారాష్ట్రలో ఈ నెల 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మహాయుతి కూటమి పేరుతో బిజెపి, శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్‌సిపి (అజిత్ పవార్) పోటీ చేస్తున్నాయి.

## బీజేపీ తీరుతో దేశం సర్వనాశనం

(మొదటి తరువాయి)

పాలకులు బీజేపీని తగులబెడుతూనే ఉన్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో రోజుల తరబడి హింస చెలరేగినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నదని రాహుల్ గాంధీ మండిపడ్డారు. కనీసం దేశ ప్రధాన మంత్రి కూడా మణిపూర్‌ను సందర్శించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని రాష్ట్రాలు తిరుగుతున్న ప్రధాని మణిపూర్‌కు వెళ్లడం లేదంటే.. మణిపూర్ అంత దుస్థితిలో మరో రాష్ట్రం లేదని బీజేపీ ఒప్పుకున్నట్లేనని రాహుల్ అన్నారు. బీజేపీ వ్యవహారశైలివల్లే మణిపూర్ కొన్ని నెలలపాటు నిప్పుల కొలిమిలా రగిలిపోయిందని అన్నారు. జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిమ్‌దెగాలో ఏర్పాటు చేసిన సభలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. జారండ్‌లో ఈ నెల 13, 20 తేదీల్లో రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

# షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిలో పండ్లు బ్రెడ్ పంపిణీ

–ఆరోగ్య ప్రదాత సీఎం రేవంత్ రెడ్డి

– షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్ నగర్ నవంబర్ 8, (నీలగిరి ఎక్స్ ప్రెస్):
తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రదాత సీఎం రేవంత్ రెడ్డి అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈరోజు రేవంత్ రెడ్డి జన్మదినమని ఆయన పుట్టినరోజు సందర్భంగా రోగులకు పళ్ళు బ్రెడ్ అందజేయడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరు ఆయనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే కోరారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల రూపాయలు ఎలాంటి నిబంధనలు లేకుండా ఇస్తున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నూతన ప్రణాళికలతో ముందడుగు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యా వైద్యానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు..

## నాయి బ్రాహ్మణుల కమిటీ హాల్ నిర్మాణానికి 50వేల రూపాయలు అందజేసిన మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్



నాయి బ్రాహ్మణుల కమిటీ హాల్ నిర్మాణానికి 50వేల రూపాయలు అందజేసిన మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్

కడ్తాల్ నవంబర్ 8, (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కడ్తాల్ మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణుల కుల సంగం కమిటీ హాల్ నిర్మాణం కోసం కడ్తాల్ మండల వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ నాయి బ్రాహ్మణుల కుల పెద్దలకు యాబై వేల రూపాయలు విరాళంగా అందచేసిన మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, కమిటీ హాల్ కు సహకరించిన వైస్ ఎంపీపీ ఆనంద్ గారి కుల పెద్దలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానుగుల అంజయ్య, కానుగుల రాజు ,కానుగుల కానుగుల వెంకటేష్, కానుగుల లక్ష్మణ్, కానుగుల శ్రీను, కానుగుల శివ, కానుగుల ధోని, కానుగుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో సీ ప్లేన్ ట్రయల్ రన్



శ్రీశైలం 8, నవంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం శ్రీశైలం రానున్నారు. పర్యాటకరంగం అభివృద్ధిలో భాగంగా విజయవాడ నుండి శ్రీశైలం క్షేత్రానికి సీ ప్లేన్ ను సీఎం ప్రారంభించనున్నారు. రేపు సీ ప్లేన్ లో సీఎం శ్రీశైలం చేరుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి శ్రీశైలం వరకు సీ ప్లేన్ ట్రయల్ రన్ నిర్వహించారు. శ్రీశైలం డ్యాం బ్యాక్ వాటర్ లో దాదాపుగా కిలోమీటర్ మేర నీటిలో ఈ విమానం ప్రయాణిస్తుంది. పాతాళగంగ వద్దకు చేరుకొని అక్కడనుండి రోప్ వే శ్రీశైలం చేరుకొని సీఎం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకొనున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎంపీ మల్లు రవి



హైదరాబాద్, నవంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాష్ట్రాన్ని ఇందిరమ్మ రాజ్యంతో ఇంటింటా వెలుగు నింపే లక్ష్యంతో కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ్తన్న ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

–టిపిసిసి సభ్యులు సుధీని రాంరెడ్డి, అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కడ్తాల్ నవంబర్ 8,
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కడ్తాల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల్ కేంద్రంలో టపాకాయలు కాలుస్తూ కేక్ కటింగ్ మరియు పండ్లు స్వీట్లు పంచడం జరిగింది. ఈ సందర్భంగా పీసీసీ సభ్యులు సుదీని రాంరెడ్డి, అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, గారు, డిసిసి ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్ , బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ గార్లు మాట్లాడుతూ ప్రజా పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి కిరణమని కొనియాడారు. అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం మరియు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిక్షణం అలుపెరుగని పనిచేస్తున్న నాయకుడన్నారు. ప్రతిరోజు ప్రజలే ధ్యాసగా ప్రజా సంక్షేమ అభివృద్దే ధ్యేయంగా పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడు రేవంత్ రెడ్డి గారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం రేవంత్ రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాలకు సమాన న్యాయం కలుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అన్ని రంగాలలో దూసుకెళు_ందని తెలియజేశారు. తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందని, ప్రభుత్వ పథకాలతో పేద ప్రజల పక్షాన నిలుస్తుంది అన్నారు. విద్య, ఉద్యోగ,ఆర్థిక, , సామాజిక,రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉండడం కులగణన లేకపోవడమే ప్రధాన కారణమని భావించి, ఎన్నికల ముందు కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్టుగానే కులగణన కు శ్రీకారం చుట్టిన బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, గౌరవనీయులు రేవంత్ రెడ్డి గారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రేవంత్ మిత్రమండలి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆసిఫ్ అలీ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షులు రామకృష్ణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు జాంగిర్ బాబా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్, బీసీ సెల్ అధ్యక్షుడు యాదయ్య, మాజీ సర్పంచ్ వేణు పంతులు, సీనియర్ నాయకులు బ్రహ్మచారి, బిక్షపతి, లక్ష్మణ్ నాయక్, మాలె మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ విశ్వవిద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు






కర్నూలు, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
రాయలసీమ విశ్వవిద్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గారు, ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు శ్రీ వెంకట హరినాథ్ గారు, రాయలసీమ విశ్వవిద్యాలయ వి.సి. ఎన్‌టికే నాయక్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు. నవంబర్ 9 న జాతీయ న్యాయ సేవ దినోత్సవం పురస్కరించుకొని ఈ రోజు, నవంబర్ 8న, న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి న్యాయ సేవ దినోత్సవ ప్రత్యేకత, సైబర్ చట్టాలు, ఉచిత న్యాయ సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

# ఆదోనిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సేకరణ పరిశీలన



ఆదోని, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఆదోనిలోని రైల్వే గేటు ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం శుక్రవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో స్థల సేకరణ పరిశీలన జరిగింది.
ఈ సందర్భంగా, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఉప తహశీల్దార్ గుండల నాయక్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు మరియు సూర్య రికార్డులపై వివరణ ఇచ్చారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు




వెల్దండ, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, మండల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకొని, కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, తిరుపతి రెడ్డి, పర్వత్ రెడ్డి, రషీద్, ఎర్ర శీను, కృపానందం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బిసి ఐక్యవేదిక కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



హైదరాబాద్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ బిసి ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ మాట్లాడుతూ, “తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భగవంతుని ఆశీస్సులు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, తెలంగాణ స్ఫూర్తి ప్రదాత రేవంత్ రెడ్డి కి ప్రత్యేక శుభాకాంక్షలు” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశరథం పటేల్, రమేష్ రాజు, అభిషేక్, నిఖిల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన విద్యా కమిషన్ సభ్యుడు డా. చరకొండ వెంకటేష్



హైదరాబాద్ 8, నవంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డా. చరకొండ వెంకటేష్ ముఖ్యమంత్రిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సేవ చేస్తూ ప్రజాసేవా మార్గంలో కొనసాగాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ప్రగతి, సమృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఆయన నాయకత్వం మరింత స్ఫూర్తిదాయకంగా మారాలని ఆకాంక్షించారు.

# యాదాద్రి ఇకపై యాదగిరిగుట్ట

– సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మారుస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.~ ఆయన అధికారులను యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా పేరు మార్చాలని ఆదేశించారు. ఇకపై రికార్డుల్లో ఇదే పేరు కొనసాగించాలని సూచించారు. అలాగే, టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి ఆలయ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## మొక్కలు నాటిన రాజ రాజేశ్వరి ఆశ్రమం స్వామీజీ



అన్నాస్ పల్లి, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఉత్తరాఖండ్ జగద్గురు శంకరాచార్య రాజ రాజేశ్వరి ఆశ్రమ స్వామీజీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హనుమాన్ పల్లి గ్రామంలోని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఎర్త్ సెంటర్ స్వామీజీ సందర్శించారు. ఈ సందర్భంగా, స్వామీజీని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎర్త్ సెంటర్లో మొక్కలు నాటారు. స్వామీజీ మాట్లాడుతూ, "వాతావరణ సమతుల్యత కాపాడడంలో మొక్కలు ఎంతో ఉపయోగపడతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ పీఠాధిపతి ఆశ్రమం నందు సరస్వతి, ప్రకాష్ నంద పీఠాధిపతి స్వామీజీ, మాజీ సర్పంచ్ శంకర్, జగన్ గౌడు తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) శిక్షణ సమావేశం





కర్నూలు, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్)కు వచ్చే అర్జీలను రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయడంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ రిజిస్ట్రేషన్ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రిజిస్ట్రేషన్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, "పిజిఆర్ఎస్"కు వచ్చే దరఖాస్తులను తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి, మ్యాపింగ్ చేయడం ద్వారా అర్జీదారుని సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కరించవచ్చని చెప్పారు. కెఆర్సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, తప్పుడు ఎండార్స్మెంట్స్ పై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో కెఆర్సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ అమలుపై నిర్లక్ష్యం వద్దు

### -సదానందం గౌడ్



ఆమనగల్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, 1.7.2023 నుండి రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమనగల్ మండల కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పీఆర్సీ అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్టీయూటీఎస్ గత 77 సంవత్సరాలుగా పోరాడుతుందని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేసే విధంగా మెరుగైన హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంటును అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, కరుణాకర్ రెడ్డి, పోల్ రెడ్డి, రవి, రామ సుబ్బారావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భూపాల్, ఏఐఎస్టిఎఫ్ సభ్యులు కసిరెడ్డి పురుషోత్తం రెడ్డి, పరమేశ్వర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, పాండు రంగారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏ.వి.సుధాకర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాల నర్సింహులు, నాగర్ కర్నూలు జిల్లా బాధ్యులు జిల్లెల్ల సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఇఫ్తాకార్, ఆమనగల్ మండలం అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తొమ్మిది డీఎస్పీల బదిలీలు

హైదరాబాద్, నవంబర్ 8 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)

తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జితేందర్, రాష్ట్రంలో మొత్తం తొమ్మిది మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీలు) బదిలీ అయ్యేలా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పరిపాలనా సమర్థతను మెరుగుపరచడానికి ఈ బదిలీలు చేపట్టారు. బదిలీ వివరాలు ఈ విధంగా ఉన్నాయి:

1. నిర్మల్ డీసీఆర్బీ డీఎస్పీ దేవేందర్ రెడ్డి, ఖమ్మం ఎసీపీ సీసీఆర్బీగా బదిలీ.
2. ఖమ్మం ఎసీపీ సీసీఆర్బీ డి. ప్రసన్న కుమార్, మెదక్ డీఎస్పీగా నియమించబడ్డారు.
3. వేయిటింగ్‌లో ఉన్న ఆర్. దామోదర్ రెడ్డి, అంబర్‌పేట్ పీటీసీ డీఎస్పీగా నియమితులయ్యారు.
4. జగిత్యాల డీసీఆర్బీ డీఎస్పీ జి. మహేశ్ బాబు, పీటీసీ కరీంనగర్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.
5. పీటీసీ డీఎస్పీ బి. రామానుజం, కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.
6. కాగజ్‌నగర్ డీఎస్పీ ఎ. కరుణాకర్, ఆసిఫాబాద్ డీఎస్పీగా నియమితులయ్యారు.
7. ఆసిఫాబాద్ డీఎస్పీ పి. సదయ్య, డీజీపీ ఆఫీసుకు బదిలీ అయ్యారు.
8. వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ కె. కృష్ణ కిశోర్, తూరూర్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.
9. తూరూర్ డీఎస్పీ వి. సురేష్, డీజీపీ ఆఫీసుకు బదిలీ అయ్యారు.

## ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు







అంబర్పేట్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

అంబర్పేట్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందే ప్రజా ఆర్గనైజేషన్ ఎం.కే. శ్రీనివాస్ మరియు నేలంటి మధు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులు తమ 18 సంవత్సరాల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ సెక్రెటరీ శంబుల శ్రీకాంత్ గౌడ్ మరియు ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ విచ్చేసి, కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, "యూత్ కి ఇన్స్పిరేషన్, యంగ్ డైనమిక్ లీడర్ మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు" అని తెలిపారు. టీపీసీసీ సెక్రెటరీ శంబుల శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, "దేశంలోనే మొట్టమొదటిసారిగా మన తెలంగాణ రాష్ట్రంలోనే కుల గణన ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్, నల్లకుంట డివిజన్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.ల

## మళ్లీ రంగంలోకి దిగిన హైడ్రా




హైదరాబాద్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

హైడ్రా మరోసారి రంగంలోకి దిగి, అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు చేపట్టింది. తాజా నివేదిక ప్రకారం, హైడ్రా అధికారులు 50 మందికి నోటీసులు జారీ చేశారు. ఈసారి ప్రత్యేకంగా పార్కులు, నాళాలు, ఫుట్పాతులపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించనున్నారు. వారం నుండి 15 రోజుల్లోగా ఈ నోటీసులు అందిన వారికి హెచ్చరికలు జారీచేసినట్లు సమాచారం. హైడ్రా, సర్వే ఆఫ్ ఇండియా ద్వారా సర్వే నిర్వహించి, ఈ అక్రమ నిర్మాణాలను గుర్తించింది.

## నవగ్రహ విగ్రహాలపై దాడి స్థలాన్ని సందర్శించిన కేంద్ర హోంమంత్రి బండి సంజయ్





శంషాబాద్ 8, నవంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ కాలనీలోని నవగ్రహ విగ్రహాలపై దుండగులు దాడి చేసిన నేపథ్యంలో, కేంద్ర హోంమంత్రి బండి సంజయ్‌కుమార్ బుక్క వేణుగోపాల్‌తో కలిసి ఆ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ ఘటనపై ఆయన సమీక్ష నిర్వహించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని ప్రభుత్వం దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అలంకార ప్రాయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

-తక్షణమే కొనుగోలు ప్రారంభించకుంటే రైతు ఉద్యమమే
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మరియు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, వరి కోతలు మొదలై 20 రోజులు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, రైతుల వరి కుప్పలు పోసుకొని కల్లాల దగ్గర పడికాపులు కాస్తున్నా పట్టించుకోకపోవడం ఏంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మొక్కుబడిగా ప్రారంభించినప్పటికీ, నేటికీ ఒక్క గింజ కూడా కొనలేదని ఆయన దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించకపోవడంతో, కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయని అన్నారు. రైస్ మిల్లర్లకు బ్యాంక్ గ్యారంటీల లింకు పెట్టడంతో వారు ముందుకు రాకపోవడంతో ధాన్యం కొనుగోలుపై అడుగులు ముందుకు పడడం లేదని విమర్శించారు. కరోనా కష్టకాలంలో కూడా గ్రామాలకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసిన కెసిఆర్ ప్రభుత్వాన్ని రైతులు అడుగడుగున గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ పంట కాలానికి రైతుబంధు డబ్బులు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పంటలను కూడా కొనలేక రైతులను ముంచిందని అన్నారు. దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు మేలు చేయడానికి, 500 బోనస్ ఎగ్గొట్టడానికి కొనుగోళ్లు చేయడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం లోగా ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే, కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్తు వెంకటరమణా రెడ్డి, ఏర్పుల చంద్రయ్య, బుగ్గ రాములు, చీరాల రమేష్, మొద్దు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**ఆమనగల్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మండలంలోని చెట్టిపల్లి గ్రామానికి చెందిన చెట్టిపల్లి కృష్ణయ్య కొడుకు చందు అలియాస్ చింటూ మరణంతో, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల వెంకటేష్ మూడు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ విషయాన్ని మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు సూరిగిమల్ల శేఖర్ ద్వారా తెలుసుకొని, మృతుని కుటుంబానికి సాయం అందించడంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సూరిగిమల్ల శేఖర్, చెట్టిపల్లి వెంకటయ్య, కంబాలపల్లి రాజు, నిరంజన్, ఎర్రం వెంకటేష్, చెట్టిపల్లి మధు, అనపోస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయంలో ఎలక్ట్రోల్స్ పై అఖిలపక్ష సమావేశం




**హైదరాబాద్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయంలో ఎలక్ట్రోల్స్ పై అఖిలపక్ష నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ ఎన్నికల అబ్జర్వర్ సీనియర్ ఐఏఎస్ అధికారి మహమ్మద్ నజీర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ నలిని పద్మావతి విచ్చేశారు. డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల విషయాన్ని నవంబర్ 28 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ చేసుకోవచ్చని, నవంబర్ 9, 10 తేదీల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్లలో బిఎల్వోలు కూర్చుంటారని, కొత్త ఓటర్స్ నమోదు గానీ ఏమైనా క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ తెలియపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి బిజెపి తరపున మర్రి శశిధర్ రెడ్డి, ఏడెల్లి అజయ్ కుమార్, కొల్లూరు పవన్ కుమార్, వివిధ అసెంబ్లీలో ఈఆర్ఓ లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వంగూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఈరోజు ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రమును రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కెవియన్ రెడ్డి ప్రారంభించారు. కె.వి.ఎన్. రెడ్డి మాట్లాడుతూ, "రైతుల పట్ల పేదల పట్ల ముందుంటాను. రైతాంగానికి ఏ సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రమేష్, వేమారెడ్డి బొజ్జ కృష్ణారెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నర్మదా, గ్రామ సంఘం అధ్యక్షురాలు అర్చన సరిత, ఎమ్మార్వో మురళి మోహన్, ఏపీఎంసీసీలు, వివో ఏలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎంజి కాలనీ తండాలో యువకుడి దారుణ హత్య

**వెల్దండ, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలోని ఎం జి కాలనీలో రత్నావత్ రాజు (30) అనే యువకుడు రాత్రి వ్యవసాయ పొలంలో హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే, రాత్రి భార్యాభర్తలు అడవి పందుల బారి నుండి కాపాడేందుకు పొలం దగ్గరకు వెళ్లారు. తెల్లవారుజామున రాజు భార్యతో మోటర్ ఆఫ్ చేసి వస్తానని చెప్పి వెళ్లాడు. రాజు ఎంతకు తిరిగి రాకపోవడంతో, అతని భార్య కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వారు పొలంలో వెతకగా, రక్తం మడుగులో పడి ఉన్న రాజును చూసి తట్టుకోలేకపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు రాజు తలపై, ముఖంపై దాడి చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు అనుమానాస్పద మృత్యువు కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

# ముఖ్యమంత్రి జన్మదినోత్సవం సందర్భంగా నాంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్ బ్లడ్ డొనేషన్





**హైదరాబాద్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా నాంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్ బ్లడ్ డొనేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్ పాల్గొని, బ్లడ్ డొనేషన్ చేసిన తర్వాత ఫిరోజ్ ఖాన్ కి ధన్యవాదాలు తెలిపారు. రమేష్ మాట్లాడుతూ, "ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ నిర్వహించి, అనాదులైన వారికి బ్లడ్ డొనేట్ చేయడం వల్ల వాళ్లకు వెలుగునిచ్చిన వాళ్ళం అవుతాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి వల్ల తదితరులు పాల్గొని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


## రేవంత్ పుట్టినరోజు సందర్భంగా తిరుమల ప్రసాదం అందచేసిన మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం తీసుకొని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, ఆయన సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి వెళ్లి, సీఎం సతీమణి గీతా రెడ్డికి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా, కలకాలము చల్లగా ఉండాలని వెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శష్పాల్ రెడ్డి, రషీద్, కీ ష్టాలు, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డైనమిక్ లీడర్.. రేవంత్..

- సీఎం రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి
-హ్యాపీ బర్త్ డే సీఎం
-రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"



**షాద్ నగర్ నవంబర్ 8, (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్‌పై పోరాడి ప్రజల్లో డైనమిక్ లీడర్‌గా రేవంత్ రెడ్డి గుర్తింపు పొందారని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులో రాజకీయాల్లో విలక్షణ నేతగా రేవంత్ ఎదిగారన్నారు. ఈరోజు ఆయన పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల నుంచి ముందుగా రేవంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామని.. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

# కల్వకుర్తిలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కల్వకుర్తి, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కాంగ్రెస్ కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున బాలా సంచల పేల్చి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా, కలకాలం చల్లగా ఉండాలని పుట్టినరోజు సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సిమ్ముల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు. ప్రాముఖ్య న్యాయవాది ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ మాట్లాడుతూ, "రాష్ట్ర ముఖ్యమంత్రి యువతకు ఆదర్శం. సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకు చేరాలంటే యువతను ముందుకు నడిపించవలసిన అవసరం ఎంతైనా ఉంది. యువ కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలు కనుక, మున్ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ ఫలాలు అందించడంలో ముందుంటారు" అని ఆకాంక్షించారు. రాహుల్ గాంధీ అడుగుజాడల్లో నడవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోరేటి శీను, నేరేడు చిన్న షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు





**వంగూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండల కేంద్రంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి, ఆయన సోదరుడు కృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు కె వి ఎన్ రెడ్డి, కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ వేమారెడ్డి తదితరులు గజస్తంభ వేడుకల్లో విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు. కొండారెడ్డిపల్లిలో దసరా వాతావరణాన్ని తలపిస్తూ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కండోపుతండాలుగా వచ్చి ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈరోజు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని, ఆంజనేయ స్వామి దర్శనం చేసుకొని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలకాలం చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నిజాంపేట్ లో ఐఎన్టీయూసి మహిళ విభాగం కార్యాలయ ప్రారంభం

**కుత్బుల్లాపూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**




నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్పలో ఐఎన్టీయూసి మహిళ విభాగం కొత్త కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యాలయాన్ని ఐఎన్టీయూసి జాతీయ అధ్యక్షులు డా. అంబటి కృష్ణమూర్తి మరియు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి, పారిశ్రామిక వాడల్లో కార్మికులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఐఎన్టీయూసి ఎల్లవేళలా తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఐఎన్టీయూసి అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సతీష్ బాబు, జాయింట్ సెక్రటరీ బి. లలిత, రాష్ట్ర ఐఎన్టీయూసి మహిళా అధ్యక్షురాలు జ్యోతి చౌదరి, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఐఎన్టీయూసి అధ్యక్షులు అనిల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుజాత యాదవ్, కొంపల్లి మున్సిపాలిటీ ఐఎన్టీయూసి అధ్యక్షురాలు కె. లలిత, బాచుపల్లి మండలం అధ్యక్షురాలు రాధ, 127 డివిజన్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, జనరల్ సెక్రటరీ రజియా సుల్తానా, 131 డివిజన్ మహిళ ఐఎన్టీయూసి అధ్యక్షురాలు కె. మమత, దుండిగల్ మున్సిపాలిటీ ఐఎన్టీయూసి అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ అప్పారావు, దుండిగల్ మున్సిపాలిటీ ఐఎన్టీయూసి మహిళా ఉపాధ్యక్షురాలు సుల్తానా, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పద్మ రావు, సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఛట్ పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సొంటిరెడ్డి పునారెడ్డి



**కుత్బుల్లాపూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారంలో లెనిన్ నగర్ లో ఛట్ పూజ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పునారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పూజలు నిర్వహించిన అనంతరం పునారెడ్డి గారు మాట్లాడుతూ, "ఇప్పుడు మీ అందుబాటులో ఉంటూ మీ సమస్యలపై పోరాడుతాను" అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లాల్ గిరి, లెనిన్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ తారా సింగ్, జనరల్ సెక్రటరీ రాజారెడ్డి, రామిరెడ్డి, శ్యామ్, కాంగ్రెస్ నాయకులు లాల్ మహమ్మద్, దండే రాజు, శ్రీనివాస్ గౌడ్, అన్వర్, మరలింగ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఛట్ పూజ కార్యక్రమంలో పాల్గొన్నకొలన్ హన్మంత్ రెడ్డి



**(నీలగిరి ఎక్స్ ప్రెస్)కుత్బుల్లాపూర్, నవంబర్ 8**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్టలోని మగ్దూం నగర్ బిహారి సోదరులు ఏర్పాటు చేసిన ఛట్ పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రషీద్, నరేందర్ రెడ్డి, రవీందర్, బుచ్చి రెడ్డి మరియు ఇతర బిహారి సోదరులు పాల్గొన్నారు.

## కల్వ సుజాత కు శుభాకాంక్షలు తెలిపిన బోనాల శ్రీనివాస్



**హైదరాబాద్ 8, నవంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆర్యవైశ్య కార్పొరేషన్ నూతన కార్యాలయం ప్రారంభించి చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన కల్వ సుజాతను ప్రజా ఏక్తా పార్టీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఆమె సేవా దృక్పథం, సామాజిక అభివృద్ధి పట్ల కట్టుబాటు ఉన్నదని ప్రశంసించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్, ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ఆమె నాయకత్వంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం



**ఆమనగల్లు, నవంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ, లయన్స్ క్లబ్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. రక్తదానం ద్వారా సమాజానికి సేవ చేయడం ద్వారా ముఖ్యమంత్రి పట్ల తమ అభిమానాన్ని, ఆయన ఇచ్చిన స్ఫూర్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన నాయకులు మాట్లాడుతూ, రక్తదానం మనుషులకు ప్రాణదాయకమని, రేవంత్ రెడ్డి ప్రేరణతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆశించారు. రక్తదానం చేయడం ద్వారా సత్ఫలితాలు పొందేందుకు ముందుకు వచ్చి ఈ శిబిరంలో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూదిని రాంరెడ్డి, అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, గుర్రం కేశవులు, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో కేక్ కట్ చేసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్రను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**-ధన్యవాదాలు తెలిపిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి....**



**(నీలగిరి ఎక్స్ ప్రెస్): / నల్గొండ ఆర్సి:**

మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్రను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి కి నల్గొండ ప్రజల తరుపున రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సంగెంలోని మూసీనది ఒడ్డున ఉన్న శివలింగానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ యాత్రను మొదలు పెట్టారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం నుంచి భీమలింగం వరకు సుమారు 2.5 కి.మీ. మేర పాదయాత్ర సాగింది.మూసీ పునరుజ్జీవ యాత్రలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ,తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, మరియు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కెవిన్ రెడ్డి



**వంగూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వంగూరు మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగూరు మండల ప్రజలు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, వంగూరు మండల ప్రెసిడెంట్ పండిత్ రావు, ప్రచార కమిటీ చైర్మన్ పాండురంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవగృహకల్పలో భూకబ్జాలను అరికట్టండి

**- సిపిఐ నాయకుడు ఉమా మహేష్**



**కుత్బుల్లాపూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలో బ్లాక్ నంబర్ 12, 24, 32 వద్ద గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని, వెంటనే ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ నాయకత్వం కుత్బుల్లాపూర్ రెవిన్యూ అధికారి రెహమాన్ గారికి వినతిపత్రం సమర్పించింది. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, "రాజీవగృహకల్ప పక్కన ప్రభుత్వ భూమి ఉందని, దానిపై కబ్జాదారుల కన్నుపడిందని, బ్లాక్ నంబర్ 24, 32, 12 పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో గతంలో నిర్మాణాలు చేపడితే అధికారులు కూల్చివేశారని, ఇప్పుడు మళ్ళీ కబ్జాలకు గురయిందని" తెలిపారు. తప్పుడు పత్రాలు సృష్టించి సుమారు 30 లక్షలకు అమ్మినట్టు ప్రచారం జరుగుతుందని, వెంటనే విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ విషయం పై అనేక పత్రికల్లో కథనాలు వచ్చాయని, ప్రభుత్వ సూచికలైన లేకపోతే ప్రజలకు ఉపయోగపడే విధంగా అంగన్వాడీ సెంటర్ లేక వ్యాయమశాల, గ్రంథాలయం లాంటి వాటి కోసం కేటాయించాలని కోరారు. లేని పక్షంలో హైడ్రాకు కూడా కంప్లైంట్ ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, కార్యవర్గ సభ్యులు హరినాథ్, సిపిఐ నాయకులు సామెల్, రవి, రాములు, యాదగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, డా. అవిజె జేమ్స్, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, బేకు శ్రీనివాస్, గడ్డం రాజేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు లాయక్, గణేష్, పెరికె శివ, పండరి, సోమన్న శ్రీధర్ రెడ్డి, రాధాకృష్ణ, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పద్మ రావు, మైనారిటీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎస్సి మరియు ఎస్టీ సెల్ నాయకులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగల తగిలి డీసీఎం వ్యాను దగ్ధం

**కల్వకుర్తి, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**



కల్వకుర్తి మండల పరిధిలోని వేపూరు గ్రామ సమీపంలో పత్తి లోడుతో వస్తున్న డీసీఎం వ్యాను విద్యుత్ తీగలకు తగిలి మంటల్లో కాలిపోయింది. ఈ సంఘటన నిన్న సాయంత్రం చోటు చేసుకుంది. డీసీఎం వ్యాను పత్తి తోలుకుంటూ వస్తుండగా, అది విద్యుత్ తీగలతో టచ్ అవ్వడం వల్ల భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మంటలు గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై, ఆరంభంలో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ, పెద్ద అగ్నిప్రమాదం కారణంగా వారికి సహాయం చేసేందుకు ఎటువంటి ఫలితం రాలేదు. కాసేపటికే పత్తి మొత్తం కాలిపోయి బూడిదగా మారింది. ఈ డీసీఎం వ్యాను సి.రు.సా వాడ నుండి వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు సంఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులకు అందించారు.

## చౌదర్పల్లి లో రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



వెల్దండ, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
వెల్దండ మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు దుబ్బాల వెంకటయ్య, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు లోడ్ గా కొండలు యాదవ్, సీనియర్ నాయకులు గొడుగు మల్లయ్య, దుబ్బాసి జగన్, మాజీవార్డ్ సభ్యులు దుబ్బాసి శ్రీశైలం, కొండల్ బలరాం, శ్రీశైలం సుబ్బాల, బాలయ్య, శ్రీశైలం యాదవ్, షాంపూరి నరసింహారెడ్డి, ఒగ్గు మల్లేష్, కొప్పు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## తర్మికల్ గ్రామంలో జాగీర్ భూముల వివాదం



కల్వకుర్తి, నవంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
కల్వకుర్తి మండల పరిధిలోని తర్మికల్ గ్రామంలో జాగీర్ భూముల వివాదం కొనసాగుతోంది. వందేళ్లకు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులు ఈ భూములను పండిస్తూ మూడు తరాలు గడిపారు. అయితే, ఇప్పటికీ ఈ భూములకు పట్టా సర్టిఫికెట్లు వారి పేర్లపై జారీ చేయకపోవడం పేద రైతుల నిరాశకు కారణమవుతోంది. “దున్నేవాడిదే భూమి” అనే సామెత కేవలం కాగితాల పరిమితంగా మిగిలిపోతోంది. తన భూములను కోల్పోకూడదని, భూములు తమవేనన్న నమ్మకంతో తర్మికల్ గ్రామ రైతులు దృఢంగా నిలబడుతున్నారు. గ్రామ రైతుల వాదనల ప్రకారం, ఈ భూములు దక్కించుకునేందుకు కబ్జాకోర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామంలో సుమారు 275 ఎకరాల భూములపై వివాదం నెలకొని ఉంది. ఎన్నో ఏళ్లుగా క్రమం తప్పకుండా కిస్తీలు చెల్లిస్తూ పంటలు పండించిన ఈ రైతులు తమ హక్కులను కాపాడుకునేందుకు కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు చుట్టూ తిరుగుతున్నా, సమస్యకు పరిష్కారం దొరకకపోవడం వారి మనోభావాలను దెబ్బతీసింది. ఈ వివాదంలో పవన్ కుమార్ రెడ్డి హస్తం ఉందని రైతులు ఆరోపించారు. రైతులకు సంఘీభావం తెలిపేందుకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజి ఆచారి గ్రామాన్ని సందర్శించి, సమస్యలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, “ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, గ్రామ రైతులకు న్యాయం చేయడమే నా లక్ష్యం” అని వివరించారు.

## వివాహావేడుకలో ముగ్గురు కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు



వనపర్తి నవంబర్ 8( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
శుక్రవారం వనపర్తి పట్టణము లో కీ శే బోలమోని రంగస్వామి శ్రీమతి బోలామోని పార్వతమ్మ కుమారుడు బోలమోని నర్సింహా వివాహ వేడుకలో పాల్గొన్న వనపర్తి నియోజకవర్గ కంటెస్టెడ్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థులు గంగవరం రామకృష్ణారెడ్డి, దయానంద్ ముదిరాజ్ మరియు మునిపల్లి రంజిత్ ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు. ముగ్గురు కంటెస్టేడ్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఒకే వేదికపై చూసిన కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.
ప్రజా సమస్య లపై ఎవరి పరిది లో వారు ఎప్పటికప్పుడు స్పందించాలని సమస్యను ఐక్యత తో వనపర్తి ప్రాంత అభివృద్ధి లో ముందు ఉండాలని, ఎన్నికలవేళ ప్రత్యర్థులుగా వ్యవహరించిన ప్రజా సమస్యలపై కలిసి పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర మొత్తంలో 2000 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే, ప్రభుత్వంపై నిరసనల కార్య చరణ చేపడుతామని వారు అన్నారు. వేడుకలు సంతోషాన్నికి ఐక్యతకు మారుపెరని ఈరోజు అనుకోకుండా వారు ముగ్గురు ఒకే వేదికపై కలవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని వారు ముగ్గురు ఒకే మాటగా తెలిపారు.

## అట్టహాసంగా ఆర్యవైశ్య కార్పోరేషన్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం

-ఆర్యవైశ్య కార్పొరేషన్ తొలి చైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన కల్వ సుజాత
-హాజరైన అతిరథ మహారధులు



హైదరాబాద్ 8, నవంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఎన్నికల సమయంలో హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ను ఏర్పాటు చేశారు.కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ కల్వ సుజాతను ఆ కార్పోరేషన్ కి తొలి చైర్పర్సన్ గా నియమించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల



పక్షాన పోరాటం కానీ పార్టీ అధికార ప్రతినిధిగా తన వానిని బలంగా వినిపిస్తూ వాటిని బలపరిచినందుకు, ఆర్యవైశ్య సామాజిక వర్గంలోనూ చురుకుగా ఉన్న కారణంగా ఆమెను ఈ పదవి వరించింది. కాగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా అరణ్య భవన్ లో ఆరో అంతస్తులో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య కార్పోరేషన్ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.వేద పండితుల వేదమంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ కార్యాలయాన్ని ప్రారంభించారు .అంతకుముందు సింధ్ కాలనీ నుండి అరణ్య భవన్ దాకా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి భారీ సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,



ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్,ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి ,మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ ,మాజీ జడ్పీ చైర్మన్ సునీత మహేందర్ రెడ్డి ,కల్వకుంట్ల రమ్యారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్వ సుజాత మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం కోసం కృషి చేస్తానని ,ఆర్యవైశ్యుల్లో ఉన్న పేదలకు కచ్చితంగా అండగా నిలబడతానని ,ఆర్యవైశ్య కార్పోరేషన్ ద్వారా ఆర్యవైశ్య పేదల కష్టాలు తీరుస్తానని గ్రామాల్లో పర్యటిస్తూ ఆర్యవైశ్యుల కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానని ,ప్రభుత్వం ద్వారా వీలైనాన్ని నిధులు తీసుకువచ్చి ఆర్యవైశ్య కార్పొరేషన్ మరియు ఆర్యవైశ్య సామాజిక వర్గ అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు.

# 25 కోట్ల వ్యయంతో ఆటస్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

– తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

వనపర్తి నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
వనపర్తి జిల్లాలో దాదాపు రూ. 25 కోట్ల వ్యయంతో క్రీడా మైదానాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు చేస్తున్నట్లు రాష్ట్ర స్పోర్ట్స్ అధారిటీ చైర్మన్ కే. శివసేన రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని, మర్రికుంట మెడికల్ కళాశాల వద్ద కొత్తగా హాకీ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన, పెద్దగూడెం గ్రామ పరిధిలోని క్రీడా ప్రాంగణం, గ్రామ పక్కన ఉన్న మరో 3 ఎకరాల ఖాళీ స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. పట్టణం మధ్యలో ఉన్న ఈ ఖాళీ స్థలంలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ తో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు డి.పి.ఆర్ సిద్ధం చేయాలని స్పోర్ట్స్ అధారిటీ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ ను ఆదేశించారు. అవసరం అయితే పక్కనే ఒక సమీకృత ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఏమేరకు అవకాశాలు ఉన్నాయో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇండోర్ స్టేడియంలో ఈరోజు నుండి నిర్వహిస్తున్న ఉమ్మడి



జిల్లాస్థాయి చేస్ ఎంపికల పోటీలను తిలకించారు. బ్యాడ్మింటన్ వుడెన్ కోర్టు ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు చేయాలని అధికారులను సూచించారు. అనంతరం మర్రికుంట మెడికల్ కళాశాల వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. 12.5 ఎకరాల ఖాళీ స్థలం ఉండి పక్కనే మెడికల్ కళాశాల, కలక్టరేట్ భవనం ఉండటం వల్ల ఖేలో ఇండియా పథకంలో భాగంగా ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. హాకీ స్టేడియంలో సింతటిక్ టర్ఫ్ ఏర్పాటుకు రూ. 6 కోట్లు నిధులు విడుదల అయ్యాయని టర్ఫ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఖేలో ఇండియాకు పంపాలని సూచించారు. పెద్దగుడెం గ్రామ శివారులో 5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన చైర్మన్, జిల్లా కలక్టర్ మిని స్టేడియం ఏర్పాటుకు మంచి అవకాశాలు ఉన్నాయని, స్థలం కొలతలు చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య ను ఆదేశించారు. ఇదే గ్రామంలో మరో చోట మరో 3 ఎకరాల ఖాళీ స్థలాన్ని పరిశీలించిన చైర్మన్ క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రానున్న కాలంలో దేశంలో ఒలింపిక్ క్రీడల నిర్వహణకు వనపర్తి జిల్లాలోని క్రీడా మైదానాలు ఉపయోగ పడేవిధంగా మరియు జిల్లాలోని క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు గా తీర్చిదిద్దేందుకు క్రీడా మైదానాలు చాల ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. మర్రి కుంట వద్ద స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు మరింత స్థలాన్ని కేటాయిస్తామని తెలియజేశారు. స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్, టెక్నికల్ డైరెక్టర్ చంద్రా రెడ్డి, కార్యనిర్వహక ఇంజనీరు అశోక్, పంచాయతీ రాజ్ శాఖ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, పీ. ఈ.టి. సురేందర్ రెడ్డి, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చైర్మన్ వెంట పాల్గొన్నారు.

## మాజీమంత్రి కృషితో అత్యంత సుదరంగా రూపుదిద్దుకుంటున్న బంజారాభవనం

-గిరిజన సేవాసమితి జిల్లా మాజీఅధ్యక్షులు జాత్ర్ నాయక్
-మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్



వనపర్తి నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
మాజీమంత్రి నిరంజన్ రెడ్డి జిల్లా గిరిజనుల కోసం ఎంతో శ్రమించి రాజాపేట శివారులో అత్యంత విలువైన భూమి 30 గుంటలు కేటాయించి జిల్లా గిరిజన భవనం రాష్ట్రములోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ని ఒప్పించి ఒక కోటి ఇరువై లక్షల రూపాయలు మంజూరు చేయించి సహకరించారని అందుకు గిరిజన జాతి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని జాత్రు నాయక్ అన్నారు. నిరంజన్ రెడ్డి తనహయాములో జరిగిన అభివృద్ధి పనులు ఎక్కడ నిలిచిపోకూడదని ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేసి జిల్లా గిరిజన భవనం సంత్ సేవాలాల్ జయంతి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిరంజన్ రెడ్డి అధికారులను కోరారని జాత్ర్ నాయక్ వివరించారు.
శుక్రవారం నిరంజన్ రెడ్డి ఆదేశం మేరకు జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ తో కలిసి ఆయన గిరిజన భవనం పనులను పరిశీలించి చేయవలసిన అభివృద్ధి పనులను మాజీ మంత్రికి చేరవేశాము అని చెప్పారు.

## పాలిటెక్నిక్ మైదానంలో లైట్లు ఏర్పాటు చేయండి

-గణేష్ వాకింగ్ గ్రూప్ అధ్యక్షులు గోనూరు వెంకటస్వామి.



వనపర్తి నవంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
శుక్రవారం వనపర్తిపాలిటెక్నిక్ మైదానంలో లైట్లు ఏర్పాటు చేయమని గణేష్ వాకింగ్ గ్రూప్ అధ్యక్షులు గోనూర్ వెంకటస్వామి వారి బృందంతో మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.
లక్షల రూపాయలు పెట్టి కొత్తగా రోడ్డు నిర్మించారు కానీ ఇంతవరకు ఎలక్ట్రికల్ పోల్స్ గాని లైట్లు గాని వేయలేదని తాము గతంలో ఒకసారి కలెక్టర్కు కలిసి సమస్యను చెప్పగా కమిషనర్కు తెలుపమని ఆయన అన్నారు కావున కమిషనర్ను కలవడానికి వెళ్తే ఆయన లేనందుకు మున్సిపల్ మేనేజర్ అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశామని గణేష్ వాకింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ వెంకటస్వామి తెలిపారు.
ఈ సందర్భంగా సంఘం సభ్యులు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఉదయము సాయంత్రము వందల మంది వాకింగ్ చేస్తుంటారని ముఖ్యంగా వృద్ధులు షుగర్ పేషెంట్లు ఐదు సంవత్సరాల పిల్లలనుంచి 70–80 సంవత్సరాల వృద్ధుల వరకు ఈ మైదానం లో వాకింగ్ జగిగ్ చేస్తుంటారు లైట్లు లేకపోవడం మూలాన భయం భయంతో నడుస్తూ కొన్నిసార్లు కిందపడి గాయాలు కూడా తగులుతుంటాయని ఆయన అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పాండు, సురేందర్ వేణుగోపాల్, సుదర్శన్ రెడ్డి, గోపాల్, రవీందర్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,కృష్ణమూర్తి,మారం బాలేశ్వరయ్య తదితరులు వారి వెంట ఉన్నారు.



## కియారా అద్వానీ హొయలు

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కియారా అద్వానీ. ఈ భామ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో పోషిస్తున్న గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. నవంబర్ 9న లక్నోలో గేమ్ ఛేంజర్ టీజర్ గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. నవంబర్ 9న మూడు రాష్ట్రాలు 11 థియేటర్లలో సాయంత్రం 4:30 గంటల నుంచి సెలబ్రేషన్స్ ఉండబోతున్నాయని తెలియజేశారు. మరోసారి టీజర్ డేట్ గుర్తు చేస్తూ కియారా అద్వానీ లుక్ విడుదల చేశారు మేకర్స్. నీలం రంగు కాస్ట్యూమ్స్‌లో హొయలుపోతూ అందాలు ఆరబోస్తున్న లుక్ నెట్టింట హల్‌చల్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ చిత్రంలో రాజోలు సుందరి అంజలి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.






## ప్రేక్షకుల ముందుకు ఇడ్లీకడైతో ధనుష్

### –ఫస్ట్‌లుక్ రిలీజ్

ఈ ఏడాది రాయన్‌తో హీరో కమ్ డైరెక్టర్‌గా సూపర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్న కోలీవుడ్ స్టార్ యాక్టర్ ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. కాంపౌండ్ నుంచి వస్తోన్న మరో చిత్రం ఇడ్లికడై. ఈ చిత్రం షూటింగ్‌ను సైలెంట్‌గా మొదలు పెట్టి ఇప్పటికే అభిమానులకు సర్‌ప్రైజ్ చేశాడు ధనుష్. 4గా వస్తోన్న ఈ చిత్రంలో నిత్యమీనన్ హీరోయిన్‌గా నటిస్తుంది. తాజాగా సినిమా విడుదల తేదీ ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ మూవీని 2025 ఏప్రిల్ 10న విడుదల చేయనున్నారు. తాటాకుల పైకప్పుతో ఉన్న చిన్న రూం వైపు నడుచుకుంటూ వెళ్తున్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఇంతకీ ఈ సారి ఎలాంటి స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ మూవీలో అరుణ్ విజయ్, సత్యరాజ్, అశోక్ సెల్వన్, రాజ్‌కిరణ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ (డెబ్యూ) నిర్మిస్తోన్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తిరు సినిమా తర్వాత ధనుష్, నిత్యమీనన్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.



## ఐటెమ్ సాంగ్‌లో శ్రీలీల

### పుష్ప.2 ఇక రచ్చరచ్చే

తెలుగు ప్రజలతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్రాంచైజీ మూవీలో టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారని తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో స్పెషల్ సాంగ్‌కు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ పాటలో ముందు శ్రద్ధాకపూర్‌ను అనుకోగా వర్కవుట్ కాకపోవడంతో శ్రీలీలను తీసుకున్నారని తెలిసిందే. తాజాగా శ్రీలీల సాంగ్ షూట్‌లో జాయిన్ అయిందట. రిలీజ్ డేట్‌ను దృష్టిలో పెట్టుకుని జెట్ స్పీడులో సాంగ్ చిత్రీకరిస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ పాట కోసం వారం రోజుల తీసుకోబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. గుంటూరు కారం తర్వాత చేస్తున్న రెండో పెద్ద సినిమా కావడం శ్రీలీలకు బాగా కలిసొస్తుందని అభిప్రాయపడుతున్నారు ట్రేడ్ పండితులు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## పుష్ప 2’ ప్రమోషన్స్. ఇండియా వైడ్‌గా భారీ ఈవెంట్‌లు ప్లాన్ చేస్తున్న మేకర్స్

మరో 27 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా పుష్ప 2 సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. 3 ఏండ్లుగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ ఎట్టకేలకు డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందకు వస్తుంది. అయితే ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో మేకర్స్ భారీ ప్రమోషనల్ ఈవెంట్‌లను ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే వరల్డ్ వైడ్‌గా పుష్ప ఫీవర్ స్టార్ట్ అయిన విషయం తెలిసిందే. ఓవర్సీస్‌లో పుష్ప బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా.. హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. అయితే పాన్ ఇండియా వైడ్‌గా తెగ హైప్ ఉన్న ఈ సినిమాకు సంబంధించి ప్రమోషనల్ ఈవెంట్‌లను భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.ప్రమోషనల్ ఈవెంట్‌లో భాగంగా ఇండియాలోని ఆరు పెద్ద నగరాలను మేకర్స్ సెలక్ట్ చేసినట్లు తెలుస్తుంది. ఇందులో హైదరాబాద్‌తో పాటు, పాట్నా, ముంబై, కొచ్చి, చెన్నై, బెంగళూరులో పుష్ప ప్రీ రిలీజ్ జరుపబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై మైత్రి మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా వస్తున్న ఈ చిత్రంలో రావు రమేష్, అజయ్, డాలీ ధనుంజయ, ఫహాద్ ఫజిల్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తుండగా.. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు..



## ఓటీటీలో దేవర సందడి.. ఎన్ని భాషల్లో స్ట్రీమింగ్ అవుతుందంటే..

టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం దేవర .కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగాగ్రాండ్‌గా విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రాన్ని థియేటర్లలో మిస్సయిన వారి కోసం ఓటీటీ స్ట్రీమింగ్ అప్‌డేట్ వచ్చేసింది.ముందుగా వచ్చిన వార్తల ప్రకారం నేడు (నవంబర్ 8న) దేవర ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చేసింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. హిందీ భాషలో కూడా త్వరలో అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. థియేటర్లలో దుమ్ము దులిపేసిన దేవర మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటునేది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇంకేంటి మరి దేవర మేనియా చూసి ఎంజాయ్ చేయండి మరి. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటించగా.. ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మించారు.